## క్లుప్తంగా

### సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



చెక్కు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**దుద్యాల్:** సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని ఆలేడ్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు గొల్ల వెంకటయ్య పేర్కొన్నారు. బుధవారం గ్రామానికి చెందిన గొల్ల అశోక్‌కు మంజూరైన సీఎంఆర్ఎఫ్ రూ.53వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పేదల ఇంట్లో పెద్ద కొడుకులాగా ప్రైవేట్ ఆస్పత్రుల్లో మెరుగైన చికిత్స కోసం మంజూరు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొంపలి వెంకటేశ్, కిష్టప్ప, రాములు, మల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ



విద్యార్థులకు గ్లాసులు, ప్లేట్లు అందిస్తున్న దాత శివశంకర్‌గౌడ్

**కొత్తూరు:** మున్సిపాలిటీ పరిధిలోని స్టేషన్‌తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నేత శివశంకర్‌గౌడ్ విద్యార్థుల పట్ల ఉదారత చాటుకున్నారు. గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు ఆయన బుధవారం తన సొంత ఖర్చులతో భోజన ప్లేట్స్, వాటర్ బాటిల్స్, గ్లాసులను అందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ అంగూర్‌నాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి నాయకులు, వ్యాపారులు తమవంతు సహకారం అందించాలన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ బడులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం అన్నమ్మ, నాయకులు సురేష్, సతీష్, శశిరేఖ, రాజు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

### షెడ్ నిర్మాణానికి భూమిపూజ



నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న నాయకులు

**కొందుర్గు:** కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ఆవరణలో పేరెంట్స్ సౌకర్యార్థం ఏర్పాటు చేయనున్న షెడ్ నిర్మాణ పనులకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుంజల్‌పహాడ్ గ్రామస్తుడు కృష్ణ పాఠశాల ఆవరణలో రూ.2లక్షల సొంత ఖర్చుతో షెడ్ నిర్మాణం చేపట్టడం అభినందనీయమన్నారు. కృష్ణను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు ముందుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారి నిస్సీ షేకీనా, నాయకులు జహంగీర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి

చేవెళ్ల ఏడీఏ సురేష్‌బాబు



ముర్తూజగూడలో రిజిస్ట్రీని పరిశీలిస్తున్న సురేశ్‌బాబు

**మొయినాబాద్/మొయినాబాద్ రూరల్:** ప్రతీ రైతు తమ వివరాలను వ్యవసాయాధికారులకు తెలియజేసి ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరిగా చేయించుకోవాలని చేవెళ్ల ఏడీఏ సురేష్‌బాబు సూచించారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని ముర్తూజగూడ, మండల పరిధి చాకలిగూడలో ఫార్మర్ రిజిస్ట్రీ పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ రైతుకు 11 అంకెల యూనిక్ కోడ్ కేటాయిస్తూ ఫార్మర్ రిజిస్ట్రీ జరుగుతుందన్నారు. దీని ఆధారంగానే కేంద్ర ప్రభుత్వ పథకాలు రైతులకు అందుతాయన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద వెంటనే ఫార్మర్ రిజిస్ట్రీని చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అనురాధ, ఏఈఓలు సునీల్, కుమార్, రైతులు పాల్గొన్నారు.

### రోడ్డుపై గుంతల పూడ్చివేత

**శంకర్‌పల్లి:** మున్సిపాలిటీ పరిధిలోని ఫత్తేపూర్ రైల్వే బ్రిడ్జి నుంచి కంది వైపు వెళ్లే ప్రధాన రహదారిపై పెద్దఎత్తున గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు పడుతున్న ఇబ్బందులను గమనించిన చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం బుధవారం గుంతలు ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం సమీపంలోని రెడిమిక్స్ ప్లాంట్ ప్రతినిధులతో మాట్లాడి, రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో కాంక్రీటు వేయించారు. ప్రమాదాల నివారణ కోసం ట్రాఫిక్ సీఐ చేసిన పని పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# మృత్యు గోస!

- విద్యుదాఘాతంతో చనిపోతున్న మూగజీవాలు
- జీవనోపాధి కోల్పోతున్న పాడి రైతులు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

**దౌల్తాబాద్:** గ్రామాల్లోని ప్రజలు తమ పరిధిలో ఉండే పనులు చేసుకోవడం సహజం. కానీ ఎక్కువగా గ్రామీణ జనాభా వ్యవసాయం పైనే ఆధారపడి జీవిస్తుంటారు. కొందరు వ్యవసాయ పనులతో పాటు పాడిపరిశ్రమల్లో పనిచేసుకుంటున్నారు. అందులో భాగంగా తమకున్న పాడి సంపదతో జీవనం సాగించే వారు మరికొందరు. ఈ క్రమంలో ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యానికి మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేయకపోవడంతోనే ఈ సంఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. వెరసి పాడిరైతులు జీవనోపాధి కోల్పోతున్నారు. పశుసంపదపై ఆధారపడి జీవించే వారి బతుకులు దుర్భరంగా మారుతున్నాయి. మండలంలో 33గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో సుమారు 600వరకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మను ఏర్పాటు చేశారు. అవి ప్రధాన రహదారులు, వ్యవసాయ క్షేత్రాలు, గ్రామాల్లోని ఆయా కూడళ్లలో ఉండే ట్రాన్స్‌ఫార్మర్లకు నేటికి కంచెలు ఏర్పాటు చేయలేదు. ఈ విషయంలో అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేదు. దీంతో రోజుమాదిరిగా పశువులను మేతమేపడానికి పొలాలు, వ్యవసాయక్షేత్రాలకు తీసుకెళ్లే క్రమంలో అక్కడ ప్రమాదవశాత్తు విద్యుత్ ప్రమాదాలకు బలవుతున్నాయి.



పోల్కంపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మృతి చెందిన ఆవు (ఫైల్)

దౌల్తాబాద్ గ్రామానికి చెందిన ఓ రైతుకు చెందిన ఎద్దు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి అక్కడికక్కడే మృత్యువాత పడింది. ఈ ఘటనలో రూ.60వేల వరకు నష్ట పోయాడు. మూడున్నరేళ్లు కావస్తున్నా చిల్లిగవ్వ కూడా ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందలేదని బాధిత రైతు వాపోతున్నాడు. తాజాగా పోల్కంపల్లిలోని దేశాయిపల్లి గ్రామంలో ఇద్దరి గేదెలు ట్రాన్స్‌ఫార్మర్‌కు తాకి చనిపోయాయి. దీంతో లబోదిబోమని రోదించడం వారి వంతైంది.

**కంచెలు ఏర్పాటు చేయిస్తాం..**

ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన వెంటనే ట్రాన్స్ ఫార్మర్ల వద్ద కంచెలు ఏర్పాటు చేయిస్తాం. కొన్నింటికి మంజూరు కావలసి ఉంది. పశుకాపరులు, రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. మృతిచెందిన వాటికి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటాము.

– మహిపాల్ , ఏఈ, దౌల్తాబాద్

**కొన్నింటికే ఏర్పాట్లు..**

గతంలో కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లపై పత్రికల్లో వరుస కథనాలు రావడంతో స్పందించిన ప్రభుత్వం ఇనుప కంచెలను మంజూరు చేసింది. మిగిలినవాటికి ఇంకెప్పుడు ఏర్పాటు చేస్తారని రైతులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో అత్యవసర పరిస్థితుల్లో ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు పోలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ప్రాణాంతకంగా భారీ గుంతలు!

- యథేచ్ఛగా మట్టి తవ్వకాలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు
- పట్టించుకోని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు

**దౌల్తాబాద్:** మండలంలోని వివిధ గ్రామాల్లో చెరువులు, కుంటల్లో జేసీబీ సహాయంతో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు నిర్వహిస్తున్నారు. దీంతో అక్కడ భారీ గుంతలు ఏర్పడి ప్రాణాంతకంగా మారుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో ఆయా చెరువులు, కుంటలు నీటితో నిండితే అందులో ఉన్న గుంతల లోతు తెలియక నీట మునిగి ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందన్నారు. ఇలాంటి ఘటనలు గతంలో మండలంలో చోటుచేసుకున్నాయి. గుంతలు పూడ్చడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విచ్చలవిడిగా యంత్రాలతో మట్టి, మొరం, ఇసుక తవ్వకాలతో ఆయా ప్రాంతాల్లో ప్రమాదకర గుంతలు ఏర్పడుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేపల వేటతో పాటు బట్టలు ఉతకడానికి మహిళలు స్నానం చేయడానికి చిన్నారులు ఇతర అవసరాలకు వెళ్లి అక్కడ మృత్యువాత పడుతున్నారని వాపోతున్నారు. మండలంలోని గోకఫసల్‌వాద్ చెరువులో నీటిగుంతలో పడి తల్లి, కూతురు మృతి చెందారు. దౌల్తాబాద్‌లో చేపలవేటకు వెళ్లిన ఓ వ్యక్తి గుంతలో ఇరుక్కుని అక్కడికక్కడే మృతి చెందాడు. గుముడాల గ్రామంలో మరో వ్యక్తి గుంతలో పడి మృతిచెందాడు. మిషన్‌కాకతీయ పథకంకింద చేపట్టిన పూడికతీత పనులతో పాటు పలు అవసరాలకు చెరువులు, కుంటల్లో జేసీబీ యంత్రాలతో ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరుపుతున్నారు. అలాగే ఇటుక బట్టీల వ్యాపారులు అధికారులకు మామూళ్లు ఇచ్చి యథేచ్ఛగా పట్టపగలు తవ్వుకున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఇటీవల మండలంలో పలు గ్రామాలకు రోడ్ల పనులు జరుగుతున్నాయి. అయితే ఈ రోడ్డు పనులకు చెరువులోని మట్టిని ఎక్కడ పడితే అక్కడ తవ్వకాలు జరిపి తరలిస్తున్నారు. దీంతో అవి ప్రాణాంతకంగా మారుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు.



సురాయిపల్లి చెరువులో ఇటీవల తవ్విన గుంతలు

# అభివృద్ధికి నిధులు కేటాయించండి

బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్

**తాండూరు టౌన్:** తాండూరు పట్టణంలోని బీసీ శ్మశాన వాటికను పూర్తి స్థాయి అభివృద్ధి చేయడం కోసం మరిన్ని నిధులు కేటాయించాలని సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు కందుకూరి రాజ్‌కుమార్ స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిని కోరారు. ఏళ్లుగా బీసీ శ్మశాన వాటిక అభివృద్ధికి నోచుకోకపోవడంతో అంత్యక్రియల సందర్భంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ విషయమై ఎమ్మెల్యేకు పలుమార్లు విన్నవించారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే శ్మశాన వాటికలో నీటి వసతి కోసం మోటారు బోరు వేయించి, చేతి పంపును అమర్చేలా సహకారం అందించారన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎమ్మార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. శ్మశాన వాటిక అభివృద్ధి కోసం రూ.65లక్షల మేర నిధులను కేటాయించాలని ఎమ్మెల్యేను కోరుతున్నట్లు చెప్పారు.



బీసీ శ్మశాన వాటికలో చేతి పంపును ఏర్పాటు చేయిస్తున్న నాయకులు

### పరామర్శ

**కొడంగల్:** పట్టణ మాజీ సర్పంచ్ ఆర్ గారేశ్వర్ రావ్ భార్య శశికళ రెండు రోజుల క్రితం చనిపోయారు. విషయం తెలుసుకున్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి బుధవారం కొడంగల్‌కు వెళ్లి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పట్టణ మాజీ కౌన్సిలర్ మధుయాదవ్, బీఆర్ఎస్ మండల కమిటీ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్ పర్సన్ వాణియాదవ్, బీఆర్ఎస్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

**షాద్‌నగర్:** ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చించోడ్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం జాతీయ మానవ హక్కుల, నేర నియంత్రణ సంస్థ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పలకలు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతల సహకారం ఎంతో అవసరమన్నారు. విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకొని మంచి ఉత్తీర్ణతను సాధించాలని సూచించారు. కార్యక్రమంలో జాతీయ మానవ హక్కుల, నేర నియంత్రణ సంస్థ ప్రధాన కార్యదర్శి శ్రీహరి, లీగల్ అడ్వైజర్ నర్సింగ్, ప్రోగ్రాం ఆర్గనైజర్ సందీప్, పాఠశాల ఎస్ఎంసీ చైర్‌పర్సన్ అలివేలు, నాయకులు అక్కిగారి శ్రీధర్, మహేందర్, నరేశ్, పెంటయ్య, నర్సింలు, శివకుమార్, అఖిల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమానికి కాంగ్రెస్ కృషి



రాంరెడ్డిపల్లి నూతన గ్రామ కమిటీతో నాయకులు

కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి నర్సింలు యాదవ్

**కుల్కచర్ల:** పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా కార్యదర్శి నర్సింలు యాదవ్ పేర్కొన్నారు. బుధవారం కుల్కచర్ల మండలం రాంరెడ్డిపల్లి గ్రామంలో కాంగ్రెస్ నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పేదల అభ్యున్నతే కాంగ్రెస్ లక్ష్యమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్ని తప్పనిసరిగా దశలవారీగా అమలుచేస్తామన్నారు. రాంరెడ్డిపల్లి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడిగా అనేమోని నర్సింలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా కటికెల రాకేశ్, ఉపాధ్యక్షుడిగా కృష్ణయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వడ్డె ఎల్లయ్య, కమిటీ సభ్యులుగా పలువురిని ఎంపిక చేశారు.

# సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం



పరిగిలో ఏబీవీపీ ర్యాలీ



తాండూరు టౌన్‌లో విద్యార్థుల ర్యాలీ

- రాష్ట్రీయ కళామంచ్ స్టేట్ కన్వీనర్ మల్లేశం
- ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం

**పరిగి:** విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఏబీవీపీ నిరంతర పోరాటం చేస్తుందని రాష్ట్రీయ కళామంచ్ స్టేట్ కన్వీనర్ మల్లేశం పేర్కొన్నారు. బుధవారం ఏబీవీపీ ఆవిర్భావ, జాతీయ విద్యార్థి దినోత్సవం సందర్భంగా పట్టణ కేంద్రంలో విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపేందర్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

**తాండూరు టౌన్:** తాండూరు పట్టణంలో పలు కళాశాలలకు చెందిన విద్యార్థులచే భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణాధ్యక్షుడు నర్సిములు, పూర్వ ఏబీవీపీ కార్యకర్త సిద్ధిలింగయ్య మాట్లాడుతూ జ్ఞానం, శీలం, ఏకత నినాదంతో పని చేస్తోందన్నారు. 1949 జులై 9వ తేదీన ఆవిర్భవించినప్పటి నుంచి నేటి వరకు విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అజయ్, కార్యకర్తలు శ్వేత, నవీన్, లాలూ ప్రసాద్, చందు, వంశీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

**ముందుండి పోరాడుతాం**

**అనంతగిరి:** విద్యారంగ సమస్యలపై ముందుండి పోరాడుతుందని సాందీపని పత్రిక సహ సంపాదకుడు దేవేందర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని జెండా ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. ప్రపంచంలోనే విద్యార్థుల కోసం జాతీయవాదం కోసం పనిచేస్తున్న ఏకైక అతి పెద్ద విద్యార్థి సంఘం అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ హరీష్ రావు, జిల్లా నాయకులు దయాకర్, తేజ, శివ, సాయి, శరత్ కుమార్, నరేశ్, అనిల్ కుమార్, సాయి, కౌశిక్, శ్రీకాంత్, మధు, లోకేశ్, రమేశ్, శివ శంకర్, ఉదయ్, జేస్వంత్, సంతోశ్, మహేశ్ కుమార్, పాల్గొన్నారు.

### పోలీసుల 'సిల్వర్ జూబ్లీ'

**మొయినాబాద్:** ఇరవై ఐదు సంవత్సరాల క్రితం పోలీసు ఉద్యోగంలో చేరి వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్నవారందరూ బుధవారం ఒకచోట చేరారు. ఇరవై ఐదేళ్ల అనుభవాలు, అనుభూతులను ఒకరికొకరూ పంచుకున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన 2000ల సంవత్సరం బ్యాచ్ పోలీస్ కానిస్టేబుళ్లు ఉద్యోగంలో చేరి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్ సమీపంలో ఉన్న కంట్రిసైడ్ రిసార్ట్‌లో సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బ్యాచ్‌లో మొత్తం 280 మంది ఉండగా.. అందులో 13 మంది మరణించారు. 16 మంది ఎస్సైలుగా సెలెక్ట్ అయ్యి ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐ, డీఎస్పీలుగా పదోన్నతులు పొందారు. కాగా వీరిలో 180 మంది బుధవారం సిల్వర్ జూబ్లీ వేడుకల్లో పాల్గొన్నారు. 25 ఏళ్ల పోలీసు ఉద్యోగ జీవితంలోని అనుభవాలను, అనుభూతులను పంచుకున్నారు. ఒకరి కొకరు యోగక్షేమాలు తెలుసుకుని రోజంతా సంతోషంగా గడిపారు.

### నీటి సమస్య పరిష్కారానికి సహకారం

**చేవెళ్ల:** పాఠశాలలో నీటి సమస్యను పరిష్కరించేందుకు దాత ముందుకు రావటం అభినందనీయమని దామరగిద్ద హెచ్ఎం సంగీత అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని దామరగిద్ద ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు గతంలో ఉన్న నల్లా కనెక్షన్ సక్రమంగా లేక నీళ్లు రాకపోవటంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. దీనిపై గ్రామస్తులతో చర్చించి విద్యార్థులకు నీటి సౌకర్యం కోసం ప్రత్యేక పైపులైన్ వేయించాలని కోరామన్నారు. అడిగిన వెంటనే గ్రామానికి చెందిన ఘనపురం శేఖర్ ముందుకొచ్చి తన సొంత నిధులు రూ.35వేలు ఖర్చు చేసి పైపులైన్ వేయించి సమస్య పష్కరించారన్నారు. నీటి సౌకర్యం కల్పించేందుకు సహకరించిన దాత శేఖర్‌ను ఉపాధ్యాయులు, గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో పాఠశాలలో విద్యార్థుల కోసం వాటర్ ఫిల్టర్‌ను సైతం అందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు ఉన్నారు.

### ఆధ్యాత్మికతతో ప్రశాంతత

**కొడంగల్ రూరల్:** ఆధ్యాత్మికతతో మనస్సుకు ప్రశాంతత చేకూరుతుందని జగద్గురు బురదేశ్వర పీఠం, షటస్థల బ్రహ్మ శ్రీ రాచోటేశ్వర మహాస్వామి అన్నారు. బుధవారం పట్టణంలోని మహాదేవుని ఆలయంలో, రేగడిమైలారం గ్రామంలోని రాచప్ప నివాసంలో శ్రీస్వామివారికి వేరు వేరుగా పాదపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలు అందిస్తూ ప్రవచనాలు పఠించారు. ప్రతీరోజు కొంత సమయం ధ్యానం, భగవన్నామ స్మరణ చేయడంతో మనస్సుకు ప్రశాంతత చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జంగం జగదీశ్వర్ గడ్డం చంద్రశేఖర్, గడ్డం అఖిలేశ్వర్, వినోద్‌కుమార్, మహేశ్, భానుప్రకాశ్, వీరశైవ లింగాయత్ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు విజయవర్ధన్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ రాఘపురం బస్వరాజ్, బాలప్రకాశ్, గంటి సర్వేశ్, సూరారం రాకేశ్, తారాపురం రవి, సందేశ్ తదితరులు పాల్గొన్నారు.



మహాదేవుని ఆలయ ఆవరణలో భక్తులతో శ్రీస్వామివారు

# మౌలిక వసతుల కల్పనకు కృషి



దిర్సంపల్లి పాఠశాలలో వంట గదిని ప్రారంభిస్తున్న వెంకట్

మండల విద్యాధికారి వెంకట్

**దోమ:** ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని మండల విద్యాధికారి వెంకట్ పేర్కొన్నారు. బుధవారం దోమ మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి, ఐలాబాద్ పాఠశాలలను సందర్శించారు. అనంతరం ఆయన దిర్సంపల్లి పాఠశాలలో నూతనంగా నిర్మించిన వంట గదిని గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతీ విద్యార్థికి మెరుగైన విద్యా బోధన చేయాలన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులందరికీ ఉచిత యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్‌ను ఉపాధ్యాయులు అందించేందుకు చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కేశవులు, వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచు శాంతకొండారెడ్డి, మాజీ ఎంపీటీసీ నవాజీరెడ్డి, సత్తయ్య, సీఆర్‌పీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**విద్యార్థులు ఇష్టంతో చదువుకోవాలి**

విద్యార్థులు ఇష్టంతో చదువుకుంటే జీవితంలో ఉన్నత స్థానాలను అధిగమిస్తారని పరిగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. గుండాల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉచితంగా టై, ఐడీ కార్డులు, బెల్ట్‌లను మండల విద్యాధికారి వెంకట్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతీ విద్యార్థి పాఠ్యాంశాలను శ్రద్ధతో వినాలన్నారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కేశవులు, గ్రామస్తులు రావణ్, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి

ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రవి నాయక్

**దుద్యాల్:** గ్రామాలు, పల్లెలు సంపూర్ణంగా అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రవి నాయక్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఈర్లపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పేదలకు ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదని విమర్శించారు. అనంతరం లబ్ధిదారులకు ప్రొసీడింగ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాహుల్, పిట్ల మొగులప్ప, రమేశ్, మహేశ్, పాల్గొన్నారు.



ఈర్లపల్లిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న నాయకులు

# మహిళలు ఆర్థికంగా ఎదగాలి



అనంతగిరి: మాట్లాడుతున్న కమిషనర్ జాకీర్ అహ్మద్

మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్

**అనంతగిరి:** ఇందిరా మహిళా శక్తి ద్వారా లబ్ధిపొంది ఆర్థికంగా ఎదగాలని మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ అన్నారు. బుధవారం వికారాబాద్ మున్సిపల్ ఆవరణలో ఇందిరా మహిళా శక్తి సంబురాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలకు వడ్డీని మహిళ సంఘాల ఖాతాలో జమచేయనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ మిషన్ కోఆర్డినేటర్ వెంకటేష్, కమ్యూనిటీ ఆర్గనైజర్ సరిత, పట్టణ మహిళ సమాఖ్య అధ్యక్షురాలు విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

**దుద్యాల్‌లో..**

**దుద్యాల్:** మహిళలకు అన్ని రంగాల్లో అవకాశాలు కల్పించి వారి ఆర్థిక ఎదుగుదలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అవుటి శేఖర్ అన్నారు. దుద్యాల్ రైతు వేదికలో నిర్వహించిన ఇందిరా మహిళ శక్తి సంబురాల్లో పాల్గొని మాట్లాడారు. మహిళలు కూడా ఆర్థింగా బలంగా ఉంటేనే వారికి సమాజంలో పేరు ప్రఖ్యాత, మర్యాద పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సత్యనారాయణ, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేరుగు వెంకటయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ ఖలీల్ పాషా, సీసీ సంజీవ్, గ్రామ అధ్యక్షుడు శ్రీశైలం గౌడ్, ఉపాధ్యక్షుడు కృష్ణ, నాయకులు ఖాజా తదితరులు పాల్గొన్నారు.

# విద్యా బోధనలో ఏఐతో మేలు

మండల విద్యాధికారి గోపాల్

**పరిగి:** విద్యా బోధనలో ఏఐతో విద్యార్థులకు మేలు కలుగుతుందని మండల విద్యాధికారి గోపాల్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని గడిసింగాపూర్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. అక్కడ ఏఐ బోధనను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధన నిర్వహిస్తున్నారన్నారు. ఏఐ బోధనలను విద్యార్థులు ఇష్టంగా వింటున్నారన్నారు. ఆన్‌లైన్ పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. మెను ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డించాలని పేర్కొన్నారు. భోజన సమయంలో ఏజెన్సీ నిర్వాహకులు తప్పకుండా పరిశుభ్రత పాటించాలని తెలిపారు. మధ్యాహ్న భోజనాన్ని ప్రధానోపాధ్యాయుడు నిత్యం పర్యవేక్షించాలన్నారు. విద్యార్థుల హాజరు శాతం, బేస్‌లైన్ రిపోర్టును వెంటనే ఆన్‌లైన్ చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అనంతరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ఏఐ తరగతులను పరిశీలిస్తున్న గోపాల్